ఆధార్ నిర్వాహకులు అధిక డబ్బులు వసూలు చేయొద్దు

రసూల్‌పురా: ఆధార్ కేవైసీ కోసంఎక్కువ డబ్బులు వసూలు చేస్తున్న సెంటర్ నిర్వాహకులపై సికింద్రాబాద్ మండల తహసీల్దార్ పాండు నాయక్ ఆగ్రహం వ్యక్తం చేశారు. రసూల్‌పురా యురేకా మోడల్ హైస్కూల్‌లో గత కొన్ని రోజుల నుంచి ఆధార్ సెంటర్ కొనసాగుతోంది. ఆధార్ కేవైసీ చేయించుకునేందుకు ప్రజలు అధిక సంఖ్యలో రావడంతో నిర్వాహకులు రూ. రెండు వందల వరకు వసూలు చేస్తున్నారు. ఈ విషయమై స్థానికులు బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు సదా కేశవ రెడ్డి దృష్టికి తీసుకెళ్లగా ఆయన తహసీల్దార్‌కు ఫిర్యాదు చేయగా శనివారం వారు ఆధార్ సెంటర్ వద్దకు వచ్చి ఆగ్రహం వ్యక్తం చేశారు. నిబంధనల ప్రకారమే డబ్బులు తీసుకోవాలని ఇష్టానుసారంగా వసూళ్లకు పాల్పడితే చర్యలు తప్పవని హెచ్చరించారు. తహసీల్దార్ వెంట అశోక్, మణికంఠ, జబ్బార్ ఉన్నారు.


ఆధార్ సెంటర్ నిర్వాహకులపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న పాండునాయక్

ఆరు గ్యారంటీల అమలుపై స్పష్టత ఇవ్వాలి

ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్

సనత్‌నగర్: రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించిన ఆరు గ్యారంటీలను ఎప్పటిలోగా అమలు చేస్తారో స్పష్టం చేయాలని ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. ప్రజల నుంచి స్వీకరిస్తున్న దరఖాస్తుదారుల్లో అర్హులను ఎప్పటిలోగా ఎంపిక చేస్తారనే విషయాన్ని ప్రభుత్వం ప్రకటించాలన్నారు. అదే విధంగా నూతనంగా రేషన్‌కార్డుల కోసం దరఖాస్తు చేసుకునేలా నిర్దిష్టమైన దరఖాస్తులను కూడా ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలన్నారు. ఆరు గ్యారెంటీలకు సంబంధించిన దరఖాస్తులు సరిపడా లేని కారణంగా ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, కొన్నిచోట్ల కొనుగోలు చేయాల్సిన పరిస్థితులు కూడా ఉన్నాయని విమర్శించారు. ప్రభుత్వం వెంటనే స్పందించి దరఖాస్తుల కొరత ఏర్పడకుండా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం ప్రజలకు మేలుచేసే కార్యక్రమాలకు తమ సహకారం ఎల్లప్పుడూ ఉంటుందన్నారు. ఆరు గ్యారంటీల కోసం అర్హులైన వారు జనవరి 6 లోపు దరఖాస్తు చేసుకోవాలని ప్రభుత్వం కోరినందున అర్హులైన వారితో దరఖాస్తు చేయించాలని వారికి సూచించారు. తమ పరిధిలోని బస్తీలు, కాలనీల్లో ఇంటింటికి వెళ్ళి అర్హులైన వారికి దరఖాస్తులను అందించేలా చూడాలని చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన ఎన్నికల హామీలను పార్లమెంట్ ఎన్నికల వరకు కూడా అమలు చేయకుండా కాలయాపన చేయాలని చూస్తుందనే అనుమానాలు కలుగుతున్నాయన్నారు. ఇచ్చిన హామీలను అమలుచేయకుంటే ప్రజలే ప్రభుత్వాన్ని నిలదీస్తారన్నారు. ఈ సమావేశంలో కార్పొరేటర్లు కొలను లక్ష్మీబాల్‌రెడ్డి, మహేశ్వరిశ్రీహరి, మాజీ కార్పొరేటర్లు అరుణగౌడ్, ఉప్పల తరుణి, నాయకులు కొలను బాల్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, గుర్రం పవన్‌కుమార్‌గౌడ్, ఆకుల హరికృష్ణ, హన్మంతరావు, వెంకటేషన్ రాజు, శ్రీనివాస్‌గౌడ్ పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే తలసాని

2 నుంచి విస్తృత పర్యటన.

జనవరి 2 నుంచి నియోజకవర్గ పరిధిలోని బస్తీలు, కాలనీల్లో విస్తృతంగా పర్యటించనున్నట్లు మాజీ మంత్రి, ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ తెలిపారు. వెస్ట్‌మారేడ్‌పల్లిలోని తన నివాసం వద్ద నియోజకవర్గ పరిధిలోని కార్పొరేటర్లు, మాజీ కార్పొరేటర్లు, బీఆర్‌ఎస్ పార్టీ ముఖ్య నాయకులతో శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నియోజకవర్గ పరిధిలోని ఆరు డివిజన్లలోని బస్తీలు, కాలనీల్లో పర్యటించి చేపట్టిన అభివృద్ధి పనులను పర్యవేక్షించడం జరుగుతుందని, అదే విధంగా ఆయా ప్రాంతాల్లోని ప్రజల సమస్యలను కూడా తెలుసుకుంటామన్నారు. జనవరి 2న బన్సీలాల్‌పేట డివిజన్‌లో, 3న రాంగోపాల్‌పేట డివిజన్, 4న సనత్‌నగర్ డివిజన్‌లలో పర్యటిస్తామని తెలిపారు. నియోజకవర్గ పరిధిలోని ప్రజల ఇబ్బందులను తొలగించేందుకు కోట్లాది రూపాయల విలువైన వివిధ అభివృద్ధి పనులను చేపట్టడం జరిగిందని, ఎన్నికల కోడ్ కారణంతో కొన్ని పనులు నిలిచిపోయాయని త్వరలోనే అవి కూడా ప్రారంభం అవుతాయన్నారు.

ఎర్రగడ్డ రైతుబజార్‌లో కూరగాయల ధరలు

సనత్‌నగర్: టమాటా రూ.19, నల్లవంకాయ 45, పొడుగు వంకాయ 45, బెండకాయ 45, పచ్చిమిర్చి 45, బజ్జీమిర్చి 50, క్యాప్సికమ్ 55, పచ్చకాకర 58, పందిరి బీర 45, క్యాబేజీ 17, క్యారెట్ 32, దొండ 45, గుండుబీన్స్ 45, గింజ చిక్కుడు 65, గోకరకాయ 45, కీర 13, దోసకాయ 25, బీట్‌రూట్ 25, ఉల్లిగడ్డ 20, ఆలుగడ్డ 21, చామగడ్డ 45, మొరంగడ్డ 23, కందగడ్డ 45, సొరకాయ 15, పొట్లకాయ 13, అరటికాయ 9, మునగకాయ 4-6, ముల్లంగి 4-6. ఈ ధరలు ఆదివారం ఉదయం 9 గంటల వరకు అమలులో ఉంటాయి.

రేపు త్యాగరాజుస్వామి ఆరాధనోత్సవం

సనత్‌నగర్: మోడల్‌కాలనీ రెసిడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జనవరి 1న 176వ త్యాగరాజుస్వామి వారి ఆరాధనోత్సవం నిర్వహిస్తున్నట్లు కాలనీ సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి జేఎస్‌టీ శాయి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా కాలనీ సంస్కృతి కమ్యూనిటీ హాల్లో సోమవారం సాయంత్రం 5.30 గంటలకు నర్తనశాల డ్యాన్స్ అండ్ మ్యూజిక్ అకాడమీ విద్యార్థులచే సాంస్కృతిక ప్రదర్శనలు ఉంటాయన్నారు.

విజేతలకు అభినందనలు


విజేతలను అభినందిస్తున్న ఎమ్మెల్యే రాజాసింగ్

సనత్‌నగర్: మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయి స్పోర్ట్స్ లీగ్ ఇంటర్ కాలేజ్ క్రికెట్ పోటీ విజేతగా నిలిచిన ఎస్‌ఆర్‌ఐ కళాశాల టీమ్‌ను గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ అభినందించారు. వాజ్‌పేయి జయంతి సందర్భంగా ఇటీవల సనత్‌నగర్ లేబర్ వెల్ఫేర్ గ్రౌండ్‌లో ఆయన పేరిట స్పోర్ట్స్ లీగ్‌ను నిర్వహించిన విషయం తెలిసిందే. పోటీ విజేతలు శనివారం రాజాసింగ్‌ను కలవగా వారిని ఆయన అభినందించి మాట్లాడారు. ఇలాంటి క్రీడా పోటీలు యువతలో స్ఫూర్తిని నింపుతాయని ఇలాంటి కార్యక్రమాలకు తన వంతు సహకారం ఉంటుందన్నారు.

ప్రజాపాలన అభయహస్తం కేంద్రాల సందర్శన

రసూల్‌పురా: ప్రజాపాలన అభయహస్తం కార్యక్రమానికి నేడు (ఆదివారం) రేపు న్యూ ఇయర్ సందర్భంగా (సోమవారం) సెలవు ఉంటుందని మంగళవారం నుంచి దరఖాస్తులు స్వీకరిస్తారని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ప్యారసాని రామ్‌కుమార్ తెలిపారు. శనివారం పీసీసీ ప్రధాన కార్యదర్శి బొల్లు కిషన్‌తో కలిసి కంటోన్మెంట్ లోని పలు ప్రజాపాలన అభయహస్తం దరఖాస్తు స్వీకరణ కేంద్రాలను సందర్శించి ప్రజల ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. ప్రజలకు పలు అంశాలపై అనుమానాలను నివృత్తి చేశారు. ఒకే దరఖాస్తు ఫారం ద్వారా అన్ని పథకాలకు సంబంధించి దరఖాస్తు చేయాలని రేషన్ కార్డు, ఆధార్ కార్డు జిరాక్స్ జత చేయాలని రేషన్‌కార్డు లేని వారు ఆధార్ కార్డు జిరాక్స్ జత చేయాలని సూచించారు. పీసీసీ ప్రధాన కార్యదర్శి బొల్లు కిషన్ మాట్లాడుతూ దరఖాస్తు ఫారంలో తప్పులు దొర్లకుండా అధికారులు పకడ్బందీగా పనిచేయాలని కోరారు. తమ పార్టీ కార్యకర్తలు అందుబాటులో ఉండి ప్రజలకు సహకరిస్తున్నారని అన్నారు.ఈ కార్యక్రమంలో అష్రాఫ్, బిట్టు, రాకేష్, శ్రీను పాల్గొన్నారు.


దరఖాస్తు ఫారం అందజేస్తున్న బొల్లు కిషన్

అభివృద్ధి పనుల్లో వేగం పెంచాలి

సికింద్రాబాద్: నియోజకవర్గంలో కొనసాగుతున్న అభివృద్ధి పనుల్లో వేగం పెంచాలని ఎమ్మెల్యే పద్మారావుగౌడ్ ఆదేశించారు. సీతాఫల్‌మండిలోని ప్రభుత్వ కళాశాలల భవనాలతో పాటు కుట్టి వెల్లొడి ఆస్పత్రి నిర్మాణ పనులను శనివారం ఆయన పరిశీలించి మాట్లాడారు. తమ హయంలోనే ప్రభుత్వ స్కూల్, జూనియర్, డిగ్రీ కాలేజీలను ఏర్పాటు చేశామని కొత్త భవనాల నిర్మాణానికి రూ. 30 కోట్ల మేరకు నిధులను మంజూరు చేయించామన్నారు. కార్పొరేట్ విద్యాసంస్థలకు దీటుగా కొత్త హంగులతో స్కూల్, జూనియర్, డిగ్రీ కాలేజీ భవనాలను తీర్చిదిద్దాలన్నారు. ఆయన వెంట సుంకు రాంచందర్, బొల్ల సుమిత్ యాదవ్, కైరంకొండ యాదగిరి, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.


పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే పద్మారావుగౌడ్

ఇబ్బందులు రానివ్వొదు..

సికింద్రాబాద్: రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన వివిధ గ్యారంటీల పథకాలకు దరఖాస్తు చేసేందుకు అర్హులైన వారికి అవకాశం కల్పించాలని ఎమ్మెల్యే పద్మారావుగౌడ్ సూచించారు. శనివారం సీతాఫల్ మండిలోని ఆయన కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. పేదలకు ఉపకరించే దరఖాస్తు పత్రాలను కూడా కొందరు డబ్బులకు విక్రయించడం దారుణమని ఆగ్రహం వ్యక్తం చేశారు. సికింద్రాబాద్ అసెంబ్లీ నియోజకవర్గంలోని ఐదు మున్సిపల్ డివిజన్లకు సంబంధించి అర్హులైన ప్రతీ ఒక్కరూ ఇబ్బంది పడకుండా అధికారులు సహకరించాలని జీహెచ్‌ఎంసీ డీసీ, ఇతర అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు గరికపోగుల చంద్రశేఖర్, వైవి. బాలాజీ, రాజు తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ పోలీసుల ఫోన్ నంబర్లు

బన్సీలాల్‌పేట్: సికింద్రాబాద్ పరిసర ప్రాంతాల్లో ట్రాఫిక్ క్రమబద్ధీకరణ..సమస్యల పరిష్కారానికి ఆ విభాగం అధికారులు, సిబ్బంది నిర్మాణాత్మకమైన కార్యచరణతో ముందుకు సాగుతున్నారు. నిత్యం రోడ్లపై విధులు నిర్వహిస్తూ ఎక్కడ ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటున్నారు. నిత్యం వేలాది వాహనాల సంచారం ట్రాఫిక్ సందడితో కిటకిటలాడే ప్రధాన రహదారులు, చౌరస్తాల్లో ట్రాఫిక్ జామ్ అయిన వెంటనే అక్కడికి చేరుకొని ట్రాఫిక్‌ను క్లియర్ చేస్తున్నారు. ట్రాఫిక్ సమస్యలతో పాటు ఇతరత్రా ఇబ్బందులు ఉన్నప్పుడు ప్రజలు ఫోన్ చేస్తే వెంటనే స్పందిస్తున్నారు.

- పి. మధుసూదన్‌రెడ్డి (ఏసీపీ) 87126 60613
- ఎస్. సైదులు(గోపాలపురం ఇన్‌స్పెక్టర్) 87126 60621
- పి. ఉపాశంకర్(మహంకాళి ఇన్‌స్పెక్టర్) 87126 60622
- సీహెచ్ రామయ్య(మారేడ్‌పల్లి ఇన్‌స్పెక్టర్) 87126 60625
- ఎల్. మధుబాబు (తిరుమలగిరి ఇన్‌స్పెక్టర్) 87126 60624
- పి. పాపయ్య(బేగంపేట్ ఇన్‌స్పెక్టర్) 87126 60632
- వి. నాగయ్య(బోయిన్‌పల్లి ఇన్‌స్పెక్టర్) 87126 60751
- సీహెచ్ శ్రీనివాసులు(చిలకలగూడ ఇన్‌స్పెక్టర్) 87126 60753

సెంట్రల్ సెన్సార్ బోర్డు సభ్యుడిగా నక్క శ్రీనివాస్‌గౌడ్



సనత్‌నగర్: సెంట్రల్ సెన్సార్ బోర్డు సభ్యుడిగా అమీర్‌పేట డివిజన్‌కు చెందిన బీజేపీ సీనియర్ నేత నక్క శ్రీనివాస్‌గౌడ్ నియమితులయ్యారు. ఈ మేరకు సెంట్రల్ సెన్సార్ బోర్డు రీజనల్ ఆఫీసర్ షిఫాలీకుమార్ చేతుల మీదుగా శ్రీనివాస్‌గౌడ్ ఉత్తర్వులు అందుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తనపై నమ్మకం ఉంచి సెంట్రల్ సెన్సార్ బోర్డు సభ్యుడిగా నియామకానికి సహకరించిన కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి, బీజేపీ మహంకాళి జిల్లా అధ్యక్షులు శ్యాంసుందర్‌గౌడ్‌కు ధన్యవాదాలు తెలిపారు. సుదీర్ఘకాలంగా సేవలందిస్తున్న తనను పార్టీ గుర్తించడం తనకెంతో ఆనందంగా ఉందన్నారు. పార్టీ కోసం అంకితభావంతో పనిచేసే వారికి అవకాశాలు వస్తాయని తన నియామకంతో మరోసారి రుజువైందన్నారు.

నయాసాల్ జోష్‌కు సిద్ధం

డీజేలతో హోరెత్తించనున్నట్లు ప్రత్యేక ఈవెంట్లు

సనత్‌నగర్: నూతన సంవత్సర వేడుకలకు యువత సిద్ధమవుతున్నారు. ప్రత్యేక ఈవెంట్లతో నయాసాల్ జోష్‌ను రెట్టింపు చేసేందుకు నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు చేశారు. డీజేల హోరుతో కుర్రకారును హుషారెత్తించనున్నారు. డిసెంబర్ 31 ఆదివారం కావడంతో దారులన్నీ న్యూ ఇయర్ ఈవెంట్ల వైపే సాగనున్నాయి. కంట్రీక్లబ్ ఆధ్వర్యంలో వార్ ఆఫ్ ది డీజే థీమ్‌తో నిర్వహించే కొత్త సంవత్సర వేడుకలకు బేగంపేట రసూల్‌పురాలోని పోలీస్ హాకీ గ్రౌండ్ ముస్తాబైంది. సాయంత్రం 7 గంటల నుంచే కొత్త ఏడాది స్వాగత సంబురాలు మొదలుకానున్నాయి. సినీతారలతో నృత్య ప్రదర్శనలు, అంతర్జాతీయ డీజేల బృందంతో సంగీత హోరులో ఓలలాడించనున్నారు. బేగంపేట చిరాన్‌పోర్ట్ క్లబ్‌లో న్యూఇయర్ వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేశారు. ప్రతియేటా ఇక్కడ జరిగే వేడుకలకు ప్రఖ్యాత డీజేలు తమ సంగీతంతో ఆహుతులను మంత్రముగ్ధులను చేస్తున్నారు. ఈ సారీ ఇక్కడ జరిగే వేడుకలకు సినీ డ్యాన్సర్లతో పాటు డీజేల బృందం కాక పుట్టించనుంది. అలాగే ఎప్పటిలాగానే బేగంపేట కంట్రీక్లబ్ న్యూఇయర్ వేడుకలకు సిద్ధమైంది. ఇక్కడ సెలబ్రిటీలు హాజరై తమ ఆటపాటలతో యువతను ఉర్రూతలూగించనున్నారు. వీటితో పాటు గ్రీన్‌పార్క్, మ్యారీగోల్డ్, ఆదిత్య హోమ్‌టెల్, ఆదిత్య పార్క్ ఇన్, మానససరోవర్ ఫెర్న్ హోటళ్లలో సంగీత కార్యక్రమాల నిర్వహణకు ఏర్పాట్లు కొత్త సంవత్సరం అనగానే వివిధ రకాల కేకులు తయారవుతుంటాయి. ఆ దిశగా కేక్‌ల తయారీదారులు నిమగ్నమయ్యారు. కొంతమంది ప్రత్యేక డిజైన్లతో కూడిన కేక్‌లకు ముందుగానే ఆర్డర్స్ ఇచ్చారు. నేటి యువత అభిరుచులకు తగ్గట్టుగా కేక్‌లనూ తయారు చేస్తున్నారు.

ఘనంగా ఆవిర్భావ దినోత్సవం

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూలో ఎస్ఎఫ్‌ఐ 54వ ఆవిర్భావ దినోత్సవాన్ని విద్యార్థులు ఘనంగా నిర్వహించారు. శనివారం ఆర్ట్స్ కాలేజీ ఎదుట ఏర్పాటు చేసిన జెండాను రాష్ట్ర అధ్యక్షులు ఆర్ఎల్ మూర్తి ఆవిష్కరించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఆంజనేయులు, రవినాయక్, సాయికిరణ్, కృష్ణ, శ్రీధర్, శ్రీకాంత్, ప్రశాంత్, శిరీష పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఆర్ఎల్ మూర్తి

4 కేంద్రాలు.. 3282 దరఖాస్తులు


మాట్లాడుతున్న పద్మలత

లాలాపేట: తార్నాక డివిజన్ పరిధిలో శనివారం మూడవ రోజు జరిగిన ప్రజా పాలనకు ప్రజల నుంచి అధిక సంఖ్యలో దరఖాస్తులు అందాయి. డివిజన్ పరిధిలో ఏర్పాటు చేసిన నాలుగు కేంద్రాలకు దరఖాస్తులను సమర్పించేందుకు పెద్ద ఎత్తున తరలిరావడంతో ఆయా కేంద్రాల వద్ద సందడి నెలకొంది. వినోభానగర్ కేంద్రంలో 655, తార్నాక వార్డు కార్యాలయంలో 1151, నాగార్జున నగర్ కమ్యూనిటీహాల్ కేంద్రంలో240, మాణికేశ్వర్‌నగర్ కేంద్రంలో1236 మొత్తం 3282 దరఖాస్తులు వచ్చినట్లు అధికారులు హేమలత, వెంకటేష్, పద్మలత తెలిపారు.

నేడు, రేపు సెలవు..

ప్రజాపాలన కార్యక్రమానికి ఈ నెల 31, జనవరి 1న సెలవు ఉంటుందని దరఖాస్తు ఫారాలతో ఆయా కేంద్రాలకు ఎవరూ రావొద్దని అధికారులు సూచిస్తున్నారు. ఉచితంగానే దరఖాస్తులను అందజేస్తామని హడావుడిగా జిరాక్స్ సెంటర్లలకు వెళ్లి డబ్బులు ఖర్చు చేసుకోవద్దని జీహెచ్‌ఎంసీ డిఈఈ, మాణికేశ్వర్‌నగర్ సెంటర్ హెడ్ పద్మలత తెలిపారు.

కేంద్రాల సందర్శన


దరఖాస్తు ఫారాలు అందజేస్తున్న కంది శైలజ

బౌద్ధనగర్: డివిజన్‌లోని పలు దరఖాస్తు కేంద్రాలను శనివారం కార్పొరేటర్ కంది శైలజ సందర్శించి మాట్లాడారు. దరఖాస్తు దారులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రజలు ఆందోళన చెందవద్దని జనవరి 6వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చునని కార్పొరేటర్ కంది శైలజ తెలిపారు. కేంద్రాల్లో ఇబ్బందులు తలెత్తినా తన దృష్టికి తీసుకురావాలని చెప్పారు.

దరఖాస్తుల ఫారాలు లేక ఇబ్బందులు


మాట్లాడుతున్న రాజశేఖరరెడ్డి, శ్రీనివాస్

బన్సీలాల్‌పేట్: అభయహస్తం దరఖాస్తులను అందుబాటులో ఉంచాలని బీజేపీ నాయకులు డిమాండ్ చేశారు. శనివారం బన్సీలాల్‌పేట్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో బీజేపీ సికింద్రాబాద్ పార్లమెంటరీ నియోజకవర్గం కన్వీనర్ టి. రాజశేఖరరెడ్డి, మీడియా సెల్ జాయింట్ కన్వీనర్ ఎ. శ్రీనివాస్ ముదిరాజ్ మాట్లాడారు. ప్రజాపాలనలో దరఖాస్తులు అందుబాటులో లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. అభయహస్తం గ్యారంటీల కోసం దరఖాస్తు చేసుకోమని చెప్పిన ప్రభుత్వం అందుకు తగ్గ ఏర్పాట్లు లేవన్నారు. క్షేత్రస్థాయిలో అధికార యంత్రాంగం సరైన విధంగా ఏర్పాట్లు చేయకపోవడంతో ప్రజలు పడుతున్న పాట్లు అన్నీఇన్నీ కావన్నారు. బన్సీలాల్‌పేట్, చాచా నెహ్రూనగర్, రాణిగంజ్, మోండా మార్కెట్, తదితర ప్రాంతాల్లో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. ప్రజాపాలన కార్యక్రమంలో దరఖాస్తులు లేకపోవడంతో జిరాక్స్ సెంటర్ల నిర్వాహకులు దోచుకుంటున్నారన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి దరఖాస్తులను అందుబాటులో ఉంచాలన్నారు.

కేలండర్ ఆవిష్కరణ

పద్మారావునగర్: బన్సీలాల్‌పేట్ డివిజన్ భోలక్‌పూర్ క్రిష్ణవేణి టాలెంట్ స్కూల్‌లో శనివారం నూతన కేలండర్‌ను గ్రూప్స్ చైర్మన్ సంగని రాజు, కరస్పాండెంట్ డాక్టర్ మంచాల శ్రీనివాసులుతో కలిసి ఆవిష్కరించారు.



పదేళ్ల తర్వాత తెలంగాణలో ప్రజా ప్రభుత్వం



ఫారాలను అందజేస్తున్న కాంగ్రెస్ నేతలు

లాలాపేట: పదేళ్ల తర్వాత తెలంగాణలో ప్రజా ప్రభుత్వం ఏర్పాటైందని కాంగ్రెస్ ఎస్సీ డిపార్టుమెంట్ వైస్ చైర్మెన్ బర్రె యాదగిరి పేర్కొన్నారు. వినోభానగర్ కమ్యూనిటీ హాల్లో కొనసాగుతున్న ప్రజాపాలన కార్యక్రమాన్ని శనివారం ఆయన కాంగ్రెస్ నాయకులు భద్రయ్య, స్వామి తదితరులతో కలిసి పరిశీలించి మాట్లాడారు. ప్రజలు వివిధ కార్యాలయాల చుట్టూ తిరగకుండా అధికారులనే ప్రజల వద్దకు చేర్చడంతో ప్రజలకు ఎంతో మేలు జరుగుతుందన్నారు. జనవరి 6 వరకు కొనసాగుతున్న ఈ కార్యక్రమం ద్వారా ప్రజలందరి నుంచి దరఖాస్తులు స్వీకరిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో సెంటర్ హెడ్ జీహెచ్‌ఎంసీ ఏఈ వెంకటేష్, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

నేడు ప్రమాణ స్వీకారోత్సవం

లాలాపేట: లాలాపేట ఆర్యవైశ్య సంఘం నూతన కార్యవర్గం పదవీ ప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమాన్ని నఫీజ్ గార్డెన్‌లో ఏర్పాటు చేసినట్లు నూతన అధ్యక్షులు మడిపడగ శ్రీనివాస్ గుప్తా, ప్రధాన కార్యదర్శి పందిరి సాంబశివరావు గుప్తా, కోశాధికారి యెనిశెట్టి భాస్కర్ గుప్తా పేర్కొన్నారు. ముఖ్య అతిథులుగా ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షులు అమరవాది లక్ష్మీనారాయణ గుప్తా, ఎమ్మెల్యే పద్మారావు గౌడ్, డిప్యూటీ మేయర్ మోతే శ్రీలత శోభన్‌రెడ్డి హాజరవుతారన్నారు.

గంజాయి విక్రేతల రిమాండ్

బౌద్ధనగర్: గంజాయి విక్రయాలకు పాల్పడుతున్న ముగ్గురిని రిమాండ్‌కు తరలించిన ఘటన వారాసీగూడ పరిధిలో జరిగింది. శనివారం వారాసీగూడ పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో పోలీసులు వివరాలు వెల్లడించారు. దేవరవంశీ (22) కొంతకాలంగా గంజాయికి విక్రయిస్తూ కమీషన్లు తీసుకుంటున్నాడు. గతంలో గంజాయి విక్రయించే కేసులో రాయగడ జిల్లా ఎక్సైజ్ పోలీసులు అరెస్టు కూడా చేశారు. రాయగడ జైల్లో ఉన్నప్పుడు ఒడిస్సా రాష్ట్రం రాయగడ జిల్లాకు చెందిన డ్రగ్స్ పెడ్లర్లు మానస్ రంజన్ (25) చందన్ కుమార్(26)తో పరిచయం పెంచుకున్నాడు. ఈ నేపథ్యంలో ఒడిశా రాష్ట్రం నుంచి తెలంగాణకు గంజాయి సరఫరా చేస్తే కమీషన్ ఇస్తానని చెప్పి దువర వంశితో ఒప్పందం కుదుర్చుకున్నారు. న్యూయర్ నేపథ్యంలో తనకు గంజాయి కావాలని మానసిరంజన్, చందన్‌కుమార్‌కు చెప్పడంతో రాయగడ జిల్లాకు చెందిన దర్శన్ అలియాస్ జిట్టు అనే మధ్యవర్తితో 7.5కిలోల గంజాయి తీసుకుని నగరంలో విక్రయించేందుకు రైలులో వచ్చారు. సమాచారం అందుకున్న సెంట్రల్ ట్రాస్కఫోర్స్, వారాసీగూడ పోలీసులు దాడులు నిర్వహించి ముగ్గురిని అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించారు.

కోదండరామ్‌ను విద్యా మంత్రిగా నియమించాలి

ఉస్మానియా యూనివర్సిటీ: గత ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గెలుపుకోసం ఎంతో కృషి చేసిన ప్రొ.కోదండరామ్‌ను విద్యాశాఖ మంత్రిగా నియమించాలని ఓయూ విద్యార్థి నేతలు విజ్ఞప్తి చేశారు. తెలంగాణ ఉద్యమ సమయంలోను ఆ తర్వాత అనేక ఆందోళన కార్యక్రమాలు, బహిరంగ సభలలో ప్రసంగాలు చేసిన విద్యావేత్త ఓయూ విశ్రాంత అధ్యాపకులు, టీజేఎస్ రాష్ట్ర అధ్యక్షులు ప్రొ.కోదండరామ్ విద్యాశాఖ మంత్రి పదవికి అన్ని విధాలుగా అర్హులన్నారు. రాష్ట్ర అవతరణకు విశేష కృషి చేసిన ఆయన విద్యారంగం, నిరుద్యోగం, రైతులు, ధరల పెరుగుదల, ప్రజా సమస్యలపై పోరాడినట్లు విద్యార్థి నేతలు పేర్కొన్నారు.

అయ్యప్ప ఆశీస్సులతో అందరికీ శుభం




లాలాపేట: లతికా కన్న స్వామి ఆధ్వర్యంలో లాలాపేటలో శనివారం అయ్యప్ప పడిపూజ ఘనంగా నిర్వహించారు. పెద్ద సంఖ్యలో హాజరైన అయ్యప్ప మాలధారులు అయ్యప్ప స్వామి భజనలు, కీర్తనలు ఆలపించారు. స్వామియే శరణం అయ్యప్పా అంటూ భక్తులు చేసిన శరణుఘోషతో ఆ ప్రాంతం మార్మోగింది, గణపతి హోమం, సర్వాభిషేకాలు, తీర్థప్రసాదాల వితరణ తదితర పూజలు జరిగాయి. సికింద్రాబాద్ ఎమ్మెల్యే పద్మారావు గౌడ్ తనయులు కిషోర్, రామేశ్వర్, త్రినేత్రగౌడ్ పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అయ్యప్ప ఆశీస్సులతో లష్కర్ ప్రజలందరికి శుభం కలగాలన్నారు. ఈ పూజలో గురుస్వాములు మల్లికార్జున్, రమేష్, శ్రీను, అనిల్‌గౌడ్ పాల్గొన్నారు.

పడిపూజలో కార్పొరేటర్

బౌద్ధనగర్: బౌద్ధనగర్‌లో శనివారం నిర్వహించిన అయ్యప్ప స్వామి మహాపడి పూజలో స్థానిక కార్పొరేటర్ కంది శైలజ పాల్గొన్నారు. ఈ సందర్భంగా అయ్యప్ప స్వామి దర్శనం చేసుకొని తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు ఆంజనేయులు, బీఆర్‌ఎస్ నేత కంది నారాయణ, స్వాములు పాల్గొన్నారు.

నాటుతుపాకీ, బుల్లెట్లు స్వాధీనం

చిలకలగూడ : ఓ ఆటోడ్రైవర్ నుంచి నాటు తుపాకీ (తపంచా) రెండు బుల్లెట్లు స్వాధీనం చేసుకుని నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించిన సంఘటన చిలకలగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో శనివారం చోటు చేసుకుంది. నార్త్ జోన్ టాస్క్‌ఫోర్స్ డీసీపీ శ్రీబాల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. ఉత్తరప్రదేశ్, రావత్‌పూర్‌కు చెందిన మహ్మద్ అస్లాం నగరానికి వలస వచ్చి సికింద్రాబాద్ వారాసిగూడలో నివాసం ఉంటున్నాడు. వృత్తిరీత్యా ఆటోడ్రైవరైన అస్లామ్ తన మొదటిభార్య రిజ్వానాకు విడాకులు ఇచ్చి 2020లో షమీనాను వివాహం చేసుకున్నాడు. భార్య, ఆమె కుటుంబసభ్యులతో విభేదాలు తలెత్తిన నేపథ్యంలో ఇటీవల ఉత్తరప్రదేశ్‌కు చెందిన నషీమ్ నుంచి నాటు తుపాకీ (తపంచా) రెండు లైవ్ బుల్లెట్లను ఇటీవల కొనుగోలు చేశాడు. దీనిపై సమాచారం అందడంతో టాస్క్‌ఫోర్స్ సీఐ భాస్కర్‌రెడ్డి, ఎస్ఐ నవీన్‌ల నేతృత్వంలో పోలీసులు మహ్మద్ అస్లాంను అదుపులోకి తీసుకుని ప్రశ్నించగా తపంచా, బుల్లెట్లు కొనుగోలు చేసినట్లు అంగీకరించాడు. నిందితుడు మహ్మద్‌అస్లాంపై ఆర్‌జీఐ ఎయిర్‌పోర్టు, చార్మినార్ ఠాణాల పరిధిలో రెండు కేసులు పెండింగ్‌లో ఉన్నట్లు. తపంచా, బుల్లెట్లను స్వాధీనం చేసుకున్న పోలీసులు నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.

ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించొద్దు


ఫుట్‌పాత్ వ్యాపారులతో మాట్లాడుతున్న ఇన్‌స్పెక్టర్ నాగరాజు

లాలాపేట: ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా వ్యాపారాలు నిర్వహించుకోవాలని నల్లకుంట ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ నాగరాజు సూచించారు. ఫుట్‌పాత్‌లపై కొనసాగిస్తున్న వ్యాపారులకు శనివారం ఆయన కౌన్సెలింగ్ నిర్వహించారు. ట్రాఫిక్ ఇబ్బందులపై అవగాహన కల్పిస్తూ ఫుట్‌పాత్‌లను ఆక్రమించడం సరి కాదన్నారు. ఫుట్‌పాత్‌పై నడవాల్సిన పాదచారులు రోడ్డుపై వెళ్తూ ప్రమాదాల బారిన పడుతున్నారని ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా వ్యాపారాలు చేసుకోవాలన్నారు.

రాహుల్ నిర్ణయాన్ని స్వాగతిస్తున్నాం

ఉస్మానియా యూనివర్సిటీ: అధికారంలోకి వస్తే కుల గణన చేపడుతామని కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్‌గాంధీ ప్రకటించడాన్ని స్వాగతిస్తున్నామని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగంగౌడ్ శనివారం పేర్కొన్నారు. దేశంలో 76 ఏళ్ల నుంచి కులగణన చేపట్టకపోవడంతో ఓబీసీలు అన్ని రంగాలలో వెనుకబడి ఉన్నారని కుల గణనతో ఓబీసీలకు న్యాయం జరుగుతుందన్నారు.

రైలు ఢీకొని వ్యక్తి మృతి

అడ్డగుట్ట: పట్టాలు దాటుతుండగా రైలు ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన ఘటన సికింద్రాబాద్ జీఆర్పీ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. లాలాగూడ- సీతాఫల్‌మండి స్టేషన్‌ల మధ్యలోని బీ-క్యాబిన్ వద్ద శుక్రవారం రాత్రి 10 గంటల సమయంలో సుమారు 45-50 ఏళ్ల వయస్సున్న గుర్తు తెలియని వ్యక్తి పట్టాలు దాటుతుండగా రైలు ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడు.